సీఎంఆర్‌ఎఫ్‌ పేదలకు వరం



ఎల్‌ఓసీ పత్రాన్ని అందిస్తున్న కాంగ్రెస్‌ నాయకుడు జగదీశ్వర్‌గౌడ్‌

శేరిలింగంపల్లి: పేద, మధ్యతరగతి వర్గాలకు సీఎంఆర్‌ఎఫ్‌ వరంలాంటిదని కాంగ్రెస్‌ పార్టీ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ పేర్కొన్నారు. వివేకానందనగర్‌ డివిజన్‌ బస్తీకి చెందిన వనితకు సీఎంఆర్‌ఎఫ్‌ కింద రూ.1.50 లక్షల విలువ చేసే ఎల్‌ఓసీని నల్లగండ్లలో గురువారం ఆయన బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో వివేకానంద నగర్‌ నాయకులు రాఘవులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహన దారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలుశిక్ష విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం నిర్వహించిన డ్రైవ్‌లో 9 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను గురువారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఇద్దరికి రూ. 1500 చొప్పున జరిమానా, మరో ముగ్గురికి వెయ్యి, మరో వ్యక్తికి రెండు వేల జరిమానా, అదేవిధంగా మరో ఇద్దరికి రెండురోజుల జైలు, మరో వ్యక్తికి మూడు రోజులు జైలుశిక్ష విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్ల అందజేత

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌ పరిధి నిజాంపేట్‌ మెయిన్‌ రోడ్డులోని జడ్పీహెచ్‌ఎస్‌లో క్షత్రియ యూత్‌ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు గురువారం కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు పరీక్ష కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు దాతల సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సాయికుమార్‌, క్షత్రియ సేవా సమితి జాయింట్‌ సెక్రటరీ భూపతిరాజు రామకృష్ణ రాజు, క్షత్రియ యూత్‌ ఫెడరేషన్‌ సభ్యులు సుధీర్‌ వర్మ సుధాకర్‌ రాజు, ప్రశాంత్‌వర్మ, గౌతంవర్మ, శివాజీరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణను అడ్డుకోండి



డిప్యూటీ తహసీల్దార్‌ దిలీప్‌కు వినతిపత్రం ఇస్తున్న కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి గోపీనగర్‌లో కమ్యూనిటీహాల్‌, సబ్‌ పోస్టాఫీస్‌లకు కేటాయించిన స్థలాన్ని ఆక్రమిస్తున్నారని, చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు జనం కోసం అధ్యక్షులు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి గురువారం ఫిర్యాదు చేశారు. శేరిలింగంపల్లి సర్వే నెంబర్‌ 64/1లో 2,360 గజాల స్థలాన్ని బీసీ హాస్టల్‌, కమ్యూనిటీ హాల్‌, సబ్‌ పోస్టాఫీస్‌లకు 2010లో కేటాయించారు. బీసీ హాస్టల్‌ నిర్మాణం జరిగిందని, మిగిలిన స్థలంను రక్షించాలని డిమాండ్‌ చేశారు.

స్కూల్‌ ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

శేరిలింగంపల్లి: పాఠశాల స్థాయిలో ఫీజుల దోపిడీని నియంత్రించడంతో పాటు అనుమతులు లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్న స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని గురువారం శేరిలింగంపల్లి మండల విద్యాధికారికి ఆల్‌ ఇండియా ఫెడరేషన్‌ ఆఫ్‌ డెమొక్రటిక్‌ స్టూడెంట్స్‌ (ఏఐఎఫ్‌డీఎస్‌) రాష్ట్ర అధ్యక్షులు పల్లె మురళి వినతి పత్రం అందజేశారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో కార్పొరేట్‌ స్కూల్స్‌ పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా వాటికి అనుమతులు ఉన్నాయో, లేదో అని తెల్చుకోలేని పరిస్థితిలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉన్నారని వివరించారు. ఆయా స్కూల్స్‌లో అడ్మిషన్‌ ఫీజు, స్కూల్‌ ఫీజు, బుక్స్‌, యూనిఫారాలు, షూస్‌ పేరిట వేలకు వేలు దండుకుంటున్నారని తెలిపారు. ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతున్నారని ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మురళి కోరారు.

ప్రత్యేక పూజలు

ఆల్విన్‌కాలనీ: బాలానగర్‌ డివిజన్‌ పరిధిలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గురువారం ధ్వజ స్తంభ ప్రతిష్ఠ చేశారు. సంకష్ట హర గణపతి స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం అన్నదానం చేశారు.

రోడ్లు ఇలా.. రాకపోకలు ఎలా..?



రోడ్డుపైన చెత్త చెదారం, భవన నిర్మాణ వ్యర్థాలు





చందానగర్‌ జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్‌కు వెళ్లే రోడ్డు

పైప్‌లైన్‌ వేశారు.. రోడ్డు వేయకుండా వదిలేశారు

- శ్రీదేవి థియేటర్‌ రోడ్డులో వెళ్లాలంటే నరకయాతన
- నెలలు గడుస్తున్నా పట్టించుకున్నవారు లేరు
- వాహనదారుల గగ్గోలు

చందానగర్‌ : పైప్‌లైన్‌ ఏర్పాటుతో డ్రైనేజీ సమస్య తీరిందనుకుంటే రోడ్డు సమస్య నెలకొందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతల రోడ్డులో వెళ్లాలంటే నరకయాతన పడుతున్నారు. ఇక రోడ్డుపై మట్టికుప్పలు, చెత్త చెదారం, వ్యర్థాలతో పరిసరాలు అపరిశుభ్రంగా తయారయ్యాయి. చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని ఓల్డ్‌ ముంబై హైవే రోడ్డులో 100 మీటర్ల రోడ్డును తవ్వి అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ పైప్‌లైన్‌ వేశారు. రోడ్డు వేయకుండా వదిలేయడంతో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుపై ప్రయాణం నరకంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా తమ గోడు పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు.

- ముంబై జాతీయ రహదారిని ఆనుకొని శ్రీదేవి థియేటర్‌కు వెళ్లే దారి గుంతలమయంగా మారింది.
- కొన్ని నెలల క్రితం అండర్‌ గ్రౌండ్‌ డ్రైనేజీ కోసం రోడ్డు తవ్వి పైపులు వేశారు. తదనంతరం రోడ్డు గురించి పట్టించుకోలేదు
- రోడ్డుపైన చెత్త చెదారం, భవన నిర్మాణ వ్యర్థాలు వేయడం వలన వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.
- చందానగర్‌ జాతీయ రహదారిపై ఓపక్క ఫ్లైఓవర్‌ పనులు జరుగుతున్న నేపథ్యంలో వాహనదారులు శ్రీదేవి థియేటర్‌ గుండా వెళదామంటే ఆ దారి కూడా పూర్తిగా గుంతలు పడడంతో నరకయాతన పడుతున్నారు.
- అండర్‌గ్రౌండ్‌ డ్రైనేజీ పైప్‌లైన్‌ వేసినా అక్కడక్కడా మ్యాన్‌హోల్‌ మూతలు ఎత్తుగా ఉండడం వలన రాత్రి సమయాలలో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనిపై జీహెచ్‌ఎంసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తీవ్ర ఇబ్బందులు



జాతీయ రహదారి నుంచి శ్రీదేవి థియేటర్‌ వెళ్ళే చిన్నపాటి రోడ్డులో వ్యాపార సముదాయం ఉంది. పైప్‌లైన్‌ కోసం రోడ్డు తవ్వారు. నెలలు గడుస్తున్న రోడ్డు మాత్రం వేయ లేదు. రాత్రి సమయాలలో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.

–రామకృష్ణ గౌడ్‌, స్థానికుడు

వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలి



యూజీడీ పైప్‌లైన్‌ వేయడం వలన రోడ్డంతా గుంతలమయంగా మారింది. మ్యాన్‌హోల్‌ మూతలు పైకి ఉండడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డు పనులు ప్రారంభించాలి.

– శ్రీనివాస్‌, చందానగర్‌



నీటి సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు



జలమండలి ఎండి అశోక్‌రెడ్డితో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి తెలిపారని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ వెల్లడించారు. గురువారం జలమండలి కార్యాలయంలో అభివృద్ధి పనులు, నిధుల కేటాయింపుపై ఆయనతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. నీటి ఎద్దడి లేకుండా అదనపు కేటాయింపులతో పాటు అన్ని రకాల చర్యలు తీసుకునేందుకు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

మెరుగైన విద్యుత్‌ సేవలు అందించేందుకు కృషి

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, భాగ్యనగర్‌ కాలనీ, ఆల్విన్‌కాలనీ పరిధిలో మెరుగైన విద్యుత్‌ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఏడీఈ బి. ప్రసాద్‌, ఏఈలు చైతన్య, పీరు నాయక్‌, దయానంద్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి, భాగ్యనగర్‌, ఆల్విన్‌కాలనీ పరిధిలోని వినియోగదారులకు వేసవికాలంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్‌ అసౌకర్యం కలిగినా, అంతరాయం ఏర్పడ్డా విద్యుత్‌ శాఖ కంట్రోల్‌, ఫ్యూజ్‌ ఆఫ్‌ కాల్‌ సెక్షన్‌ కూకట్‌పల్లి డీఈ నెంబర్‌ 9440813132, కూకట్‌పల్లి, ఏడీఈ 9440813145, ఏఈ, కూకట్‌పల్లి 9440813156, భాగ్యనగర్‌, ఏఈ 9440813158, ఏఈ, ఆల్విన్‌కాలనీ 9491067618, ఎఫ్‌ఓసీ, కూకట్‌పల్లి 9490610177, భాగ్యనగర్‌ 9490610179, ఆల్విన్‌కాలనీ 8331041820 నంబర్‌లలో, విద్యుత్‌ టోల్‌ ఫ్రీ నెంబర్‌ 1912 లో సంప్రదించాలని కోరారు. విద్యుత్‌ వినియోగదారులు పై నంబర్ల ద్వారా తమ సమస్యలను వాట్సాప్‌ ద్వారా కూడా తెలియజేయవచ్చని తెలిపారు.

5.6 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరు అరెస్ట్‌

గచ్చిబౌలి: గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు పోలీసులు. రాయదుర్గం ఇన్‌స్పెక్టర్‌ సీహెచ్‌ వెంకన్న తెలిపిన ప్రకారం.. ఖమ్మం జిల్లాకు చెందిన వాసుదేవరెడ్డి(29), వెంకట్‌ రెడ్డిలు కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నట్లు టీ న్యాబ్‌ అధికారులు గుర్తించారు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో చిత్రపురి కాలనీ సమీపంలోని లేబర్‌ కాలనీ వద్ద గంజాయి విక్రయిస్తున్నట్లుగా సమాచారం అందడంతో రాయదుర్గం పోలీసుల సహకారంతో దాడి చేసి నిందితుల వద్ద ఐదు కిలోల 600 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులు స్నేహితులు కావడంతో నగరంలో కలిసి ఉంటున్నారు. ఉద్యోగం కోసం వచ్చి గంజాయి పెడ్లర్లుగా మారారని పోలీసులు తెలిపారు.

హోటల్‌ నిర్వాహకుడిపై హిజ్రాల దాడి

మాదాపూర్‌: హోటల్‌ నిర్వాహకుడిపై హిజ్రాలు దాడి చేసి గాయపరిచిన సంఘటన మాదాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఇన్‌స్పెక్టర్‌ కృష్ణమోహన్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌లోని ఓ రెస్టారెంట్‌కు ఈనెల 4వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు ముగ్గురు హిజ్రాలు వెళ్లారు. హోలీ సందర్భంగా రూ. 2 వేలు ఇవ్వాలని కోరారు. అందుకు రాఘవేందర్‌రావు నిరాకరించాడు. దీంతో పక్కనే ఉన్న ఐరన్‌ డస్ట్‌బిన్‌ను అతనిపై హిజ్రాలు విసిరివేయగా, ముక్కుకు తగిలి తీవ్రగాయమైంది. ఈ ఘటనపై దర్యాప్తు చేసిన పోలీసులు గురువారం అర్జు (షేక్‌హుస్సేన్‌), ఆదాఖాన్‌ (అబ్దుల్‌ సాదిక్‌ అబ్దుల్‌ రఫిక్‌), నేహ (నీలేష్‌ ఆనంద్‌ఖాడే)లను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

నేడు డయల్‌ యువర్‌ డీఎం

మియాపూర్‌: మియాపూర్‌ డిపో–2 పరిధిలో నేడు డయల్‌ యువర్‌ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్‌ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్‌, బాచుపల్లి, మల్లంపేట్‌, నిజాంపేట్‌ పరిసర ప్రాంతాల ప్రజలు ఆర్‌టీసీ బస్‌ సేవలకు సంబంధించి సమస్యలతో పాటు సూచనలు, సలహాలు తెలిపేందుకు శుక్రవారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు 9959226420 ఫోన్‌ నంబర్‌కు కాల్‌ చేయాలని కోరారు.

మనూ ఉద్యోగ మేళా తేదీ మార్పు

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయుల కోసం నిర్వహించ తలపెట్టిన ఉద్యోగమేళా తేదీలో మార్పు చేసినట్లు 'మనూ' శిక్షణ, ప్లేస్‌మెంట్‌ సెల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ మహ్మద్‌ యూసుఫ్‌ఖాన్‌ గురువారం తెలిపారు. గతంలో ప్రకటించినట్లుగా ఏప్రిల్‌ 16వ తేదీ కాకుండా ఏప్రిల్‌ 20వ తేదీ మేళాను నిర్వహిస్తామని, ఈ మార్పును అందరూ గమనించాలని పేర్కొన్నారు. 'మనూ'లో రెగ్యులర్‌, దూరవిద్యా కోర్సులు, ఇతర అర్హత కలిగిన అభ్యర్థులు తమ అభ్యర్థిత్వాన్ని యూనివర్సిటీ లింక్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. అధ్యాపకుల ఖాళీలు, ఆసక్తిగల కళాశాలలు / పాఠశాలలు/సంస్థలు ఏప్రిల్‌ 18వ తేదీ నాటికి రూ.5వేల రిజిస్ట్రేషన్‌ ఫీజుతో పాల్గొనాలని సూచించారు. ఈ జాబ్‌మేళాలో సమర్థులైన ఉపాధ్యాయులు, మానవ వనరులను పొందడానికి సహాయపడుతుందన్నారు. అనేక ఉత్తమ కళాశాలలు, పాఠశాలలు, సంస్థలు కూడా ఈ మేళాలో పాల్గొనే అవకాశం కల్పిస్తున్నామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ నంబర్లు 9848171044, 8688477911, 9044145228లో సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించకపోతే ధర్నా : సీపీఎం



దీనబందు కాలనీలో పర్యటిస్తున్న సీపీఎం నాయకులు

ఆల్విన్‌కాలనీ: దీనబందు కాలనీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్‌ చేశారు. గురువారం కాలనీలో పర్యటించి సర్వే నిర్వహించారు. మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని, లో ప్రెషర్‌ వల్ల నీరు సరిపోవటం లేదన్నారు. డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లకు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని, ఎవరికీ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్‌ చేశారు. రాత్రి సమయంలో దొంగతనాలు, పోకిరీల బెడద ఉన్న ప్రాంతాల్లో పోలీసుల పెట్రోలింగ్‌ పెంచాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, కూకట్‌పల్లి మండల కమిటీ సభ్యులు రంగారెడ్డి, పోలయ్య, చలపతిరావు, కృష్ణారావు, బాలరాజ్‌, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



నానక్‌రాంగూడ ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌రోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో హోమం చేస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

రాయదుర్గం: నానక్‌రాంగూడలోని ఓఆర్‌ఆర్‌ సర్వీస్‌రోడ్డులో అభయాంజనేయస్వామి ఆలయంలో రాధాకృష్ణ, దక్షిణామూర్తి, దత్తాత్రేయ సహిత వారాహి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠను గురువారం నిర్వహించారు. ఉదయం చతుస్థానార్చనలు, మూర్తి కుంభారాధన, మూల మంత్రహోమాలు, ధ్యానాదివాసం, బలిహరణం, మంగళశాసనం, మంత్ర పుష్పం పూజలను నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో హోమం చేశారు. కాగా శుక్రవారం ఉదయం 5 గంటలకు యంత్ర, విగ్రహ, ఆలయ, గోపుర, ధ్వజ స్తంభం, బలిపీఠం ఉంటుంది. అనంతరం మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్‌ డివిజన్‌లోని జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో గురువారం జరిగిన వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. వివిధ అంశాలపై విద్యార్థులు తయారు చేసిన సైన్స్‌ ప్రాజెక్టులు, నమూనాలు, ప్రయోగాలు ఆకట్టుకున్నాయి. కార్పొరేటర్‌ నార్నే శ్రీనివాసరావు సందర్శించి విద్యార్థుల ప్రతిభను కొనియాడారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణ, పునరుత్పాదక శక్తి, సాంకేతిక ఆవిష్కరణలు, ఆరోగ్య పరిరక్షణపై నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇటువంటి ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగుపరచవచ్చని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాయికుమార్‌, ప్రిన్సిపాల్‌, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేతాజీనగర్‌లో కార్పొరేటర్‌ పర్యటన



శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌ పరిధిలోని నేతాజీనగర్‌లో కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి గురువారం పర్యటించారు. కాలనీలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షులు భేరి రాంచందర్‌ యాదవ్‌, ఉపాధ్యక్షులు రాయుడు, సీనియర్‌ నాయకురాలు రాజేశ్వరమ్మ, జయారెడ్డి పాల్గొన్నారు.

శిల్పారామంలో థీమేటిక్‌ ఎగ్జిబిషన్‌

- ఈనెల 15వ తేదీ వరకు కొనసాగింపు
- ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో..

మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న నేపథ్య ప్రదర్శనలో మహిళలు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌, తెలంగాణ, బిహార్‌, వెస్ట్‌బెంగాల్‌, జమ్మూకశ్మీర్‌ రాష్ట్రాలకి చెందిన 50 మంది హస్తకళాకారులు పాల్గొన్నారు. పామ్‌లీఫ్‌ క్రాఫ్ట్‌, కలంకారి, ఇమిటేషన్‌ జువెలరీ, కార్పెట్స్‌, మట్టిపాత్రలు, జర్దోసి, బంజారా సూదిపని, లక్కగాజులు , చెరియల్‌ స్క్రోల్‌పెయింటింగ్‌ వంటి ఉత్పత్తులు ఉన్నాయి. ఈ ప్రదర్శనను ఆంధ్రప్రదేశ్‌ ప్రొడెక్టివిటి కౌన్సిల్‌ వారు తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర హస్తకళల క్లస్టర్‌ అభివృద్ధి పథకం కింద డెవలప్‌మెంట్‌ ఆఫ్‌ హ్యాండీ క్రాఫ్ట్స్‌, మినిస్ట్రీ ఆఫ్‌ టెక్స్‌టైల్స్‌ న్యూఢిల్లీ సౌజన్యంతో ఈ నేపథ్య ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుంది.





నేపథ్య ఎగ్జిబిషన్‌లో ఆకట్టుకుంటున్న స్టాల్స్‌



అన్ని రకాల క్లాత్‌లపై అందమైన ఎంబ్రాయిడరీ



నేను మొదటిసారి శిల్పారామం వచ్చి అమ్మకాలు చేస్తున్నాను. ఆంధ్రప్రదేశ్‌ ప్రొడెక్టివిటి కౌన్సిల్‌ ద్వారా 2 నెలల పాటు శిక్షణ పొందాను. ఏలూరు జిల్లా చింతలపూడి నుంచి వచ్చాను. ఎంబ్రాయిడరీ నేర్చుకున్నాను. అన్ని రకాల క్లాత్‌లపై అందమైన ఎంబ్రాయిడరీ డిజైన్స్‌ వేస్తాను. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సహాయపడతాయి.

–శిరీష, కళాకారిణి

మొదటిసారి వచ్చాను



నెల రోజుల పాటు బుట్టల తయారీ నేర్చుకున్నా. అందమైన రంగులతో వివిధ రకాల ఆకృతులతో తయారు చేస్తున్నాను. మొదటిసారి నా ఉత్పత్తులను ప్రదర్శనలో ఉంచాను. సందర్శకులు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– సమంత, కళాకారిణి

ఘనంగా కవయిత్రి మొల్ల జయంతి

చందానగర్‌ : కవయిత్రి మొల్లమాంబ జయంతిని పురస్కరించుకొని గురువారం హఫీజ్‌పేట్‌లో కుమ్మర సంఘం సభ్యులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు కై తాపురం వెంకటేష్‌ మాట్లాడుతూ రామాయణాన్ని తెలుగులోకి అనువదించిన కవయిత్రి మొల్ల అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కై తాపురం జితేందర్‌, సందపేట్‌ సత్తయ్య, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.